# సూర్య

www.suryaa.com

## ఎన్టీఆర్ - కృష్ణా


శుక్రవారం 17 జనవరి 2025 పేజీలు 8


## ప్రజా హృదయాల్లో... నేటి దినపత్రిక సూర్యకు సుస్థిర స్థానం

నేటి దినపత్రిక సూర్య క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించిన మంత్రి కొల్లు రవీంద్ర

8






# సమిష్టి కృషితో...

## ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం...

- ప్రజల భాగస్వామ్యంతో ప్రమాదాలను నివారిద్దాం..
- రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి.రాజశేఖర్ బాబు

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని సమిష్టి కృషితో ప్రజలలో అవగాహన కల్పించి ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రజలను పెద్దఎత్తున భాగస్వాములను చేసేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి.రాజశేఖర్ బాబు తెలిపారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేది నుండి నెల రోజుల పాటు జిల్లాలో నిర్వహించనున్న రహదారి భద్రత మాసోత్సవాల ప్రచార సామాగ్రి అయిన పోస్టర్లు, కరపత్రాలు, బుక్ లెట్స్ బ్యానెర్లను గురువారం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి.రాజశేఖర్ బాబు, డీటీసీ ఎ.మోహన్ మిగతా 2లో...

## అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయండి

### బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్, తదితర పనులపై మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులు వేగవంతం గావించాలని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశించారు. మంత్రి గురువారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో మచిలీపట్నం నియోజకవర్గంలో ఇప్పటికే చేపట్టిన, చేపట్టబోవు అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మలతో సమీక్షించారు. త్వరలో బందర్ పోర్టు రానున్నందున ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్నందున, ఇప్పటినుండే ఈ ప్రాంతంలో రానున్న పరిశ్రమలు, వాటి వల్ల లభించే ఉపాధి తదితర అంశాలపై దృష్టి సారించి అందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి చర్యలు తీసుకోవాలన్నారు. గిలకలదిండి ప్రాంతంలో ఎమ్మెస్ఎం ఇ పార్క్ అభివృద్ధి చేస్తే బాగుంటుందని, అందుకు గల అవకాశాలు పరిశీలించాలన్నారు. ఇందుకోసం అవసరమైన మాస్టర్ ప్లాన్ రూపొందించుటకు చర్యలు తీసుకోవాలని, 2

## మణి తేజది..
# ముమ్మాటికీ హత్యే

### మృతిపై అనుమానాలు ఉన్నాయి : వైసీపీ నాయకులు



వివరాలు 2లో...

### 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు
# విస్తృత ఏర్పాట్లు చేయాలి





- సన్నాహక ఏర్పాట్లను సమీక్షించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్
- గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రణాళితో ఏర్పాట్లు...
- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి.రాజశేఖర్ బాబు

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి.రాజశేఖర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన 2లో

(మొదటిపేజీ తరువాయి)



## అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయండి

ముఖ్యంగా ఇందులో అన్ని వర్గాల్లో చేతి వృత్తుల వారి జీవనోపాదులు పెంపొందించుటకు అవసరమైన శిక్షణ, యూనిట్ల స్థాపన వంటి కార్యకలాపాలు చేపట్టలన్నారు. బందరు పోర్టు రానున్న నేపథ్యంలో మత్స్యకారులు జీవనోపాధి కోల్పోకుండా, వారికి క్లస్టర్ అభివృద్ధి చేసి పడవల తయారీ యూనిట్లు ఏర్పాటు, శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా వారి జీవనోపాధికి ఎలాంటి ఆటంకం కలక్కుండా చూడవచ్చు అన్నారు. మంగినపూడి బీచ్ పర్యాటక ప్రాంతం అభివృద్ధి పరిచేందుకు,తాగునీటి అవసరాల కోసం డి- సాలినేషన్ ప్లాంట్ ఏర్పాటు, వాష్రూమ్స్ వంటి కనీస సదుపాయాలు కల్పించుటకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు.బందరు కోటలో పురాతన కట్టడాలను పరిరక్షించి హెరిటేజ్ పార్క్ గా అభివృద్ధి చేయుటకు గల అవకాశాలు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో పార్కుల సుందరీకరణతో పాటు, రోడ్ల విస్తరణ వంటి కార్యక్రమాల ద్వారా మచిలీపట్నం సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని శానిటేషన్ మెరుగు పరిచే చర్యలు తీసుకోవాలని తెలుపగా,నగరంలో 10 వార్డులకు ఒక్కొక్క జిల్లా అధికారిని శానిటేషన్ పర్యవేక్షణకై ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బందరు ఆర్డిఓ కే స్వాతి, రెవిన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

### 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు

## విస్తృత ఏర్పాట్లు చేయాలి



కార్యదర్శి కె. విజయానంద్‌కు వివరించారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నత అధికారులతో గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, నగర పోలీస్ కమీషనర్ పి.రాజశేఖర్ బాబు వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్ని గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల గురించి వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ ఈనెల 26వ తేదిన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రిపబ్లిక్ డే పరేడ్ ఛీఫ్ కోఆర్డినేటర్ సంబంధిత విభాగాల సంస్థల సమన్వయంతో ఏర్పాట్లు చేపడుతున్నామ న్నారు. రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ముఖ్యమంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి తదితర ప్రముఖులు పాల్గొంటారని ఇందుకు మినిట్ టు మినిట్‌ను అనుసరించి తగు ఏర్పాట్లు చేస్తున్నాట్లు వివరించారు. వివిఐపిల రాకపో కలను సంబంధిత వ్యక్తిగత కార్యదర్శులతో సమన్వయం చేసుకుని ఎటు వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన వేదికను ప్రోటోకాల్ నిబంధనలకు అనుగుణంగా రూపొందించి, స్టేడియంలో పోర్ట్ వాల్ డిజ్కెన్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నగర పోలీస్ కమీషనర్ పి.రాజశేఖర్ బాబు మట్లాడుతూ వేడుకలలో పాల్గొనేందుకు విచ్చేసే విఐపి వాహనాలకు ప్రత్యేక ప్రాక్సిమేట్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరాగాంధీ స్టేడియంలో వేడుకల రిహార్సల్స్ నిర్వహించాలని, ఫుల్ డ్రస్ రిహార్సల్స్‌తో పరేడ్‌ను సిద్ధం చేస్తామన్నారు. వివిఐపి, విఐపిలు ఇతర ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక సీట్లను కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వేడుకల్లో ఆర్మీ కంటెంజెంట్ రాష్ట్ర పోలీస్ బెటాలియన్స్, ఎన్‌సిసి స్కౌట్ అండ్ గైడ్స్, పోలీస్ బ్యాండ్ వంటి విభాగాలు కవాతులో పాల్గొంటారన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌కు వివరించారు.

# సమిష్టి కృషితో...ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం...



(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేశారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ రహదారి ప్రమాదాల పట్ల ప్రజలలో పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రహదారి భద్రత మాసోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 16వ తేది నుండి ఫిబ్రవరి 15వ తేది వరకు నెల రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా మాసోత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రమాదాలు నివారించేందుకు ఎప్పటికప్పుడు రోడ్డు భద్రత సమావేశాలు నిర్వహించి ప్రమాదాలకు గల కారణాలను సమీక్షించి తక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా కొంతమేరకు ప్రమాదాలను నివారించగలిగామన్నారు. ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ డేటాబేస్ (ఐఏఆర్‌డీ) యాప్ ద్వారా రవాణా, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు తదితర భాగస్వామ్య పక్షాలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సరైన విధంగా నమోదు చేయడం ద్వారా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్తమాద బాధితులను కాపాడేందుకు కృషిచేసిన వారికి గుడ్ సమారిటన్ ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రహదారి భద్రతపై ప్రజలను చైతన్యం చేయడంలో యువత, ఎన్‌జీవోలు తదితరులు వినూత్న జాగృతి కార్యక్రమాలు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజలలో పూర్తి అవగాహన కల్పించేలా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నగర పోలీస్ కమీషనర్ పి. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధలను పాటించని వారిపై చట్టరీత్య చర్యలు తీసుకుంటున్నామన్నారు, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపే వారిపై కేసులను నమోదు చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదలలో కీలకమైన మద్యం సేవించి వాహనాలు నడపడం డ్రైవింగ్ సమయంలో ఫోన్ మాట్లాడటం పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ లకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఆన్లైన్ ద్వారా కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరంగా అనేక చర్యలు చేపట్టినప్పటికి ప్రమాదాల నివారణలో ప్రజలకు అవగాహన కల్పించి వారిని భాగస్వాములను చేసినప్పుడే సత్ఫలితాలు వస్తాయన్నారు. నెల రోజుల పాటు రహదారి భద్రతా మాసోత్సవాలలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని రాజశేఖర్ బాబు పిలిపునిచ్చారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఎ. మోహన్ మాట్లాడుతూ 16వ తేది నుండి ఫిబ్రవరి 15వ తేది వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని రోడ్డుభద్రతాపై అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, అవగాహన సదస్సులు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా యంత్రాంగం సహకారంతో పోలీస్, వైద్య ఆరోగ్య, ట్రాన్స్ పోర్ట్, ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, తదితరశాఖల సమన్వయంతో స్వచ్ఛంధ సంస్థలు ప్రజలను భాగస్వాములను చేసి భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రచారసామగ్రి విడుదల కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు ఆర్. ప్రవీణ్, కె. వెంకటేశ్వరరావు, కె. శివరాం గౌడ్, ఉదయ్ శివప్రసాద్, డీవీ. రమణ, ఎన్ఎఎస్ వర్మ, కేడీవి రవికుమార్, బి. శ్రావణి, సత్యన్నారాయణ, రవాణా ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం. రాజుబాబు, డిప్యూటీ డియంహెచ్ ఓ జె. ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.



## మణి తేజది ముమ్మాటికీ హత్యే

### మృతిపై అనుమానాలు ఉన్నాయి : వైసీపీ నాయకులు



**నందిగామ, జనవరి 16, మేజర్ న్యూస్ :** చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో వైసీపీ యువ నేత చందేల్ మణితేజ మృతి విషయం తెలుసుకుని నందిగామ మార్చురీకి వైసీపీ నాయకులు చేరుకున్నారు. మణితేజ మృతదే హాన్ని ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు, జగ్గయ్యపేట నియోజకవర్గ వైసీపీ ఇంఛార్జి తన్నీరు నాగేశ్వరరారావు, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి చిన్న, వైసీపీ శ్రేణులు పరిశీలించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు మాట్లాడుతూ మణితేజ మృతి యాక్సిడెంట్‌గా చిత్రీకరించారని, తలపై బలంగా కొట్టినట్లు చాలా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. మణితేజ మృతిపై తమకు అనేక అనుమానాలున్నాయని, మాజీ సీఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు చేసినందుకు మణితేజను పోలీసులు చాలా ఇబ్బంది పెట్టారన్నారు. ఇప్పుడు కోడిపందాల వద్ద గొడవ తర్వాత మణితేజ చనిపోయాడని, మణితేజది ముమ్మాటికీ హత్యేనని, మణితేజ మృతిని హత్య కోణంలోనే దర్యాప్తు చేయాలన్నారు. నందిగామ నియోజకవర్గం లో ఇష్టానుసారంగా దాడులు చేస్తున్నారని, జై జగన్ అంటే కేసులు పెడుతున్నారని, వైసీపీ ఫ్లెక్సీలను చించి తిరిగి వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేస్తున్నారని, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. పోలీసులను వాడుకుంటూ వైసీపీ కార్యకర్తలను వేధిస్తున్నట్లు తెలిపారు. వైసీపీ నేతల వెంట నందిగామ నియోజకవర్గ వైస్సార్సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## అర్ధాంతరంగా ఆపేసిన దాన్ని పునః ప్రారంభిస్తాం

### ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్. అబ్దుల్ అజీజ్



**విజయవాడ, మేజర్ న్యూస్ :** టీడీపీ హయాంలో చేపట్టిన వక్ఫ్ బోర్డ్ డిజిటలైజేషన్‌కు గత వైసిపి ప్రభుత్వం మెయింటెనెన్స్ నిధులు విడుదల చేయక అర్ధాంతరంగా ఆగిపోయింది. దానిని పునఃప్రారంభించేందుకు ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఏపీ ఆన్లైన్ వారితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో గతంలో డెవలప్ చేసిన అసెట్, లీగల్, లీజు, రెంట్, ఈ టెండరింగ్, గవర్నమెంట్ స్కీమ్స్ మాడ్యూల్స్ గురించి వివరంగా చర్చించి వాటిని మరింత అభివృద్ధి చేసి జిఐఎస్/ జిపిఎస్ మ్యాపింగ్ చేసి వక్ఫ్ ప్రాపర్టీస్ కి జియో ఫెన్సింగ్ చేసే విధంగా డెవలప్ చేయాలని సూచించారు. పాత బకాయిలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో చర్చించి మళ్లీ వీటిని వాడుకలోకి తెస్తామని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్లో ఏపీ ఆన్లైన్ నుంచి రాజా, రమేష్, గోపీనాథ్, నూర్ అహ్మద్, వక్ఫ్ బోర్డ్ నుంచి సీఈవో అబ్దుల్ ఖాదిర్, పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం క్యాలండర్ ఆవిష్కరణ



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం క్యాలెండర్ను గురువారం చల్లపల్లి తహసీల్దార్ వారి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, ఏఎస్ఓ షేక్ అఖిలా పర్వీన్, జూనియర్ అసిస్టెంట్ పుట్టి యోజిత, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు బి. వెంకటరత్నం, ఉపాధ్యక్షులు రామకృష్ణ, గన్నవరం మండలం అధ్యక్షులు ఎం.పూర్ణచంద్రరావు, చల్లపల్లి మండల అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్నట్లు సంఘ అధ్యక్షులు వెంకటరత్నం తెలిపారు.

# పరుచూరి రామస్వామి, రాధా రుక్మిణి వంశస్తుల ఆత్మీయ సమ్మేళనం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** గతంలో కమ్యూనిస్టుల కంచుకోటగా నిలిచిన పంచాయతీ శివారు బందులాయిచెరువు గ్రామంలో పరుచూరి రామస్వామి, రాధా రుక్మిణి వంశస్తులు 275 మందితో బుధవారం ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా జరిగింది. అవనిగడ్డ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు కీర్తిశేషులు పరుచూరి సోమేశ్వరరావు తనయులు న్యాయవాది పరుచూరి రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇదే వంశానికి చెందిన పలువురు రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు పాల్గొని ఆత్మీయ అనుబంధాలను నెమరు వేసుకున్నారు. రామస్వామి రాధా రుక్మిణి లకు 10 మంది సంతానం కాగా, ఎనిమిది మంది మగ పిల్లలు, ఇరువురు మహిళలు ఉన్నారు. వీరికి మొత్తం 80 మంది సంతానం కాగా ఆ 80 మందికి పుట్టిన వారు వారి పిల్లలు మనవాళ్లుముని మనవాళ్లు మొత్తం కలిపి 275 మంది ఒకే చోట కలిసి కష్టసుఖాలు పంచుకోవడం గొప్ప అనుభూతిని కలిగిస్తుంది. వీరిలో ఆడపిల్లల సంతానమైన మాజీ మంత్రి కీర్తిశేషులు సింహాద్రి సత్యనారాయణరావు తనయుడు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర రావు, మరో ఆడపిల్ల సంతానానికి చెందిన మనవడు మాజీ మంత్రి వైఎస్ఆర్సిపి నాయకులు అంబటి రాంబాబు లు ఈ కార్యక్రమానికి హాజరై వారి వంశస్థులు సమాజానికి, దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ వారి కుటుంబ ఆత్మీయ కలయికలో తీపి జ్ఞాపకాలను కలబోసుకుంటూ పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. వీరి వంశంలో అనేకమంది రాజకీయ పదవులు అలంకరించడంతోపాటు వామపక్ష భావాలతో సమాజ మార్పుకు కృషి చేసిన వారు ఉన్నారు. అందులో పర్చూరు సోమేశ్వరరావు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో జీవితకాలం పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేయగా 1981 నుండి 1994 వరకు అవనిగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. అదేవిధంగా పర్చూరు వెంకటనారాయణ జడ్పిటిసిగా, పరుచూరి బైరాగి స్వాతంత్ర సమరయోధులుగా కూడా ఉన్నారు. అటువంటి కుటుంబాలన్నీ సంక్రాంతి సందర్భంగా ఒకచోట చేరి తమ పూర్వీకుల జ్ఞాపకాలను నంబర్ వేసుకుంటూ పూర్వీకుల గొప్పతనాన్ని పిల్లలకు వివరిస్తూ సందడి చేశారు.




## ఇంటిగ్రేటెడ్ డయాగ్నస్టిక్స్ ప్లేయర్‌గా న్యూబెర్గ్ డయాగ్నోస్టిక్స్

**విజయవాడ మేజర్ న్యూస్ :** చెన్నై ప్రధాన కేంద్రంగా ఉన్న ప్రముఖ డయాగ్నోస్టిక్స్ సంస్థ న్యూబెర్గ్ డయాగ్నోస్టిక్స్ దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ డయాగ్నస్టిక్స్ ప్లేయర్‌గా, భారతీయ సంతతికి చెందిన టాప్ 4 అతిపెద్ద డయాగ్నస్టిక్స్ ప్రొవైడర్‌లలో ఒకటిగా నిలిచిందని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ కే వేలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూబెర్గ్ డయాగ్నోస్టిక్స్ కోటక్ ఆల్ట్ నుండి భారతీయ డయాగ్నోస్టిక్స్ విభాగంలో అతిపెద్ద ప్రైమరీ ఫండ్-రైజ్‌లో రూ. 940 కోట్లను పొందిందన్నారు. 250 నగరాల్లో 10,000 టచ్ పాయింట్లు, 250కి పైగా ల్యాబ్‌లతో విస్తరించి ఉన్న విస్తృతమైన నెట్‌వర్క్‌తో, కంపెనీ భారతదేశంలోని ఆరోగ్య సంరక్షణ ల్యాండ్‌స్కేప్‌ను మార్చే మార్గంలో ఉందన్నారు. ఇది క్లినికల్ పాథాలజిస్ట్‌లు, ఆంకోపాథాలజిస్టులు, బయోకెమిస్ట్‌లు, జన్యు శాస్త్రవేత్తలు ఇతర ధృవీకరించబడిన ల్యాబ్ నిపుణులతో కూడిన అత్యంత నైపుణ్యం కలిగిన బృందాన్ని కలిగి ఉందన్నారు. కోటక్ ఆల్ట్ భాగస్వామి రాహుల్ షా మాట్లాడుతూ ఈ నిధులు వ్యక్తిగతీకరించిన ఔషధం, ఇంటిగ్రేటెడ్ డయాగ్నస్టిక్స్ రంగాలలో సంస్థ సామర్థ్యాలను మెరుగుపరచుకోవడానికి, విస్తరించడానికి సహాయం చేస్తుందన్నారు.

# ప్రాణం తీసిన దూమపాన వ్యసనం

## మంచానికి నిప్పంటుకొని వృద్ధుడి దుర్మరణం



**గుడివాడ, మేజర్ న్యూస్:** ధూమపానానికి బానిసైన ఓవృద్ధుడు చివరకు తను కాలుస్తున్న సిగరెట్ మంచానికి అంటుకొని అగ్నిప్రమాదానికి గురై మృత్యువాత పడిన ఘటన గుడివాడలో చోటుచేసుకుంది. పట్టణంలోని ద్రోణాదుల వారి వీధికి చెందిన చల్లా వెంకటేశ్వర రావు(71) కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ మంచానికి పరిమితమ య్యారు. ఆయనకు భార్య సావిత్రమ్మ, కుమారుడు శ్రీను, ఇద్దరు కుమార్తెలున్నారు. బుధవారం ఉదయం సిగరెట్ వెలిగించి నిద్రలోకి జారుకున్నాడు. అదే సమయంలో ఆయన భార్య అల్పాహారం కోసం బయటకు వెళ్లారు. ఈ నేపథ్యంలో సిగరెట్ పీకకు ఉన్న నిప్పు మంచానికి అల్లిన ప్లాస్టిక్ నవ్వారుకు అంటుకొని అగ్ని ప్రమాదానికి గురయ్యారు. కొద్ది సేపటికి అల్పాహారం తీసుకొని భార్య ఇంటికొచ్చారు. అప్పటికే మంటల్లో చిక్కుకున్న భర్తను ఇరుగు పొరుగువారి సాయంతో రక్షించి 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. శరీరం 60 శాతానికి పైగా కాలిపోవడంతో ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు కృష్ణయాజీ విజయవాడ తరలించాలని సూచించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తుండగా అక్కడే చికిత్స పొందుతూ కొద్ది సేపటికే వెంకటేశ్వరరావు మరణించారు. కాలిన గాయాలతో నరక యాతన అనుభవిస్తూ మృతి చెందడం చూపరుల్ని కంట తడి పెట్టించింది. సిగరెట్ అలవాటు వల్ల లేవలేని స్థితిలో ఈ ప్రమాదం బారిన పడి వెంకటేశ్వరరావు మృతి చెందడంతో స్థానికంగా. విషాదం నెలకొంది.

## అవసరంలేని, వాడని వైర్లను వారంలోగా తొలగించండి

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్, పౌరుల భద్రతను ప్రాధాన్యంగా తీసుకుంటూ, నగర సుందరీకరణలో భాగంగా కొన్ని కీలక చర్యలు చేపట్టింది. నగర పరిధిలో ఎక్కడైనా వేలాడుతూ ఉన్న కేబుల్, ఇంటర్నెట్ లేదా ఇతర వైర్లు, ప్రజల భద్రతకు ప్రమాదకరంగా ఉండే పరిస్థితి కనిపిస్తే, వాటిని వెంటనే తొలగించి, అందంగా ఉండేలా పునర్నిర్మించుకోవాలని గురువారం నాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అవసరంలేని, వాడని వైర్లను క్రమబద్ధీకరించి, ఒక వారం రోజుల్లోగా తొలగించాలని, ఈ నిబంధనకు అమలు చేయకపోతే, వారం తర్వాత నగరపాలక సంస్థ అధికారులు స్వయంగా రంగంలోకి దిగి, తగిన చర్యలు తీసుకుంటారని ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ తెలియజేశారు. పౌరులు, కేబుల్ ఆపరేటర్లు అందరూ ఈ విషయాన్ని గమనించి, సమర్థవంతంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నగర సుందరీకరణలో భాగస్వాములు కావాలని కోరారు.

## ప్రమాద భీమా చెక్కును కుటుంబ సభ్యులకు అందించిన నాదెండ్ల మనోహర్



**పామర్రు జనవరి 16 మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులు పామర్రు మండలం జమీదగ్గుమిల్లికి చెందిన కూనపరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వర రావు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించగా జనసేన పార్టీ ప్రమాద బీమా 5 లక్షల రూపాయల చెక్కును రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. గురువారం ఏలూరులో మర్చంట్స్ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఈ చెక్కును ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్, స్థానిక పార్టీ నాయకులు కలిసి కుటుంబ సభ్యులను ఏలూరు తీసుకువెళ్లి నాదెండ్ల మనోహర్ తో చెక్కును పంపిణీ చేయించారు.

## అగ్నిప్రమాద బాధితులకు ఆర్థికసాయం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండలం మంగళాపురంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన గొరిపర్తి శ్రీనివాసరావు కుటుంబానికి రావెళ్ల కృష్ణ ఫౌండేషన్ నిర్వాహకులు రావెళ్ల ఉదయ్కుమార్ ఆర్థికసాయం చేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఉదయ్కుమార్ రూ.10వేల నగదు, దుస్తులు అందచేశారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్, టీడీపీ నేతలు తూము కృష్ణమోహన్, కైతేపల్లి వెంకయ్య, పరుచూరి సురేష్, మండవ ప్రేమ్చంద్లు పాల్గొన్నారు.




## కొత్త 9 కేజీ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్లతో సామ్‌సంగ్ బెస్పోక్ ఏఐ లాండ్రీ పోర్ట్‌ఫోలియో విస్తరణ

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, తమ సరికొత్త 9 కేజీ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్‌లను విడుదల చేసినట్లు ప్రకటించింది. తెలివైన, సమర్థవంతమైన లాండ్రీ సొల్యూషన్స్‌లో కొత్త ప్రమాణాలను నిర్దేశించిన 12 కేజీ మోడళ్ల అద్భుతమైన విజయం తర్వాత, కొత్త 9 కేజీ వాషింగ్ మెషీన్ల శ్రేణి అదే శక్తివంతమైన పనితీరు, అధునాతన లక్షణాలను మరింత కాంపాక్ట్ పరిమాణంలో అందిస్తుంది. తాజా 9 కేజీ ఫ్రంట్ లోడ్ వాషింగ్ మెషీన్లు పెద్దలోడ్‌లను నిర్వహించడానికి సరైన పరిమాణంలో ఉన్నాయి. బట్టలు, బెడ్‌షీట్లు, తువ్వాళ్లు వంటి రోజువారీ లాండ్రీకి సమర్థవంతమైన పరిష్కారాలను అందిస్తాయి.

## భారత్ ఎన్సీఏపీ క్రాష్ టెస్ట్‌లో స్కోడా కైలాక్‌కు 5-స్టార్ రేటింగ్




**విజయవాడ మేజర్ న్యూస్ :** స్కోడా ఆటో ఇండియా మొదటి సబ్-4 మీటర్ల ఎస్‌యువి కైలాక్, భారత్ ఎన్సీఏపీ (న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్)లో ప్రతిష్టాత్మకమైన 5-స్టార్ భద్రతా రేటింగ్‌ను సాధించింది. దీనితో భారత్ ఎన్సీఏపీ పరీక్షలో పాల్గొన్న మొట్టమొదటి స్కోడా వాహనంగా కైలాక్ నిలిచి, కుషాక్, స్లావియా నెలకొల్పిన భద్రతా శ్రేష్ఠత బ్రాండ్ వారసత్వాన్ని కొనసాగిస్తోంది. స్కోడా ఆటో ఇండియా 2.0 కార్లు రెండూ పెద్దలు, పిల్లల ప్రయాణికుల రక్షణ కోసం సంబంధిత గ్లోబల్ ఎన్సీఏపీ క్రాష్ పరీక్షలలో 5-స్టార్ భద్రతా రేటింగ్‌లను సాధించాయి. ఈ సందర్భంగా, స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జనేబా మాట్లాడుతూ, సమగ్ర భద్రతా వ్యవస్థలతో వస్తున్న కైలాక్‌లో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లతో సహా విస్తృత శ్రేణి యాక్టివ్, పాసివ్ భద్రతా లక్షణాలు ప్రామాణికంగా ఉన్నాయని తెలిపారు. హాట్-స్టాంప్డ్ స్టీల్ వాడకం, రీడోన్ క్రాష్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో కైలాక్‌లో సాధ్యమైనంత ఉత్తమమైన భద్రతను నిర్ధారిస్తుందని పేర్కొన్నారు.

## రోడ్లపై ఆవులను వదిలిన యజమానులకు రూ. 10,000 జరిమానా



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు రోడ్లపై ఆవులను వదిలిన యజమానులకు రూ.10,000 జరిమానా విధించనున్నట్లు ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ తెలిపారు. రోడ్లపై పశువులను వదిలిపెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడం, ప్రమాదాలు సంభవించడం, ప్రజలకు అసౌకర్యం కలిగించే అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ చర్యల్లో భాగంగా, ఆవులను రోడ్లపై వదిలిపెట్టకుండా నియంత్రించేందుకు అజిత్ సింగ్ నగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కాటిల్ షెడ్ లో గోవుల ఆరోగ్య సంరక్షణ కోసం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్. రెడ్డి పర్యవేక్షణలో ఉంటాయని తెలిపారు. ప్రజలందరూ రోడ్లపై పశువులను వదిలిపెట్టకుండా సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం, పర్యావరణం పరిరక్షణే ఈ చర్యల ప్రధాన లక్ష్యమని అన్నారు.

## జనసైనికులపై దాడిని ఖండిస్తున్నాం

**జనసేన నియోజకవర్గం సమన్వయకర్త తంబళ్ళపల్లి రమాదేవి**



**నందిగామ, జనవరి 16, మేజర్ న్యూస్:** గత రెండు రోజుల నుండి జన సైనికులపై జరుగుతున్న దాడులను నందిగామ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్ళపల్లి రమాదేవి తీవ్రంగా ఖండించారు. గురువారంనాడు పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూ దాడుల వెనక ఉన్నవారు ఎవరైనా సరే వారిని విడిచిపెట్టమని తక్షణమే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా పోరాటం చేస్తామని తెలియజేశారు. మొన్న వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామం జనసైనికులను పై దాడి చేశారు నేడు నందిగామ మండలం అడవిరావులపాడు గ్రామంలోని జనసైనికులపై దాడి చేశారు. మౌనంగా ఉన్నామని మా చేతకానితనం అనుకుంటే తీవ్రమైన పరిణామాల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది అని హెచ్చరించారు. జరిగిన దాడి గురించి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభానుకి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయానికి తెలియజేశామని అన్నారు. నందిగామ పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు అందుబాటులో లేనందున ఫోన్ లో నందిగామ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త తంబళ్ళపల్లి రమాదేవి పరామర్శించారు. ఈ దాడి వెనుక ఉన్నవారు ఎవరైనా ఎంతటి వారైనా సరే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకునే లాగా చూస్తానని జన సైనికులకు భరోసా ఇచ్చారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరగకుండా చూస్తానని రమాదేవి అన్నారు.

## చారిత్రాత్మక గ్రామం ఘంటసాల

**ఎన్నారై గొర్రెపాటి రంగనాధ బాబు దంపతులు**

**ఐ లవ్ యు ఘంటసాల బోర్డు ప్రారంభించిన ప్రవాస భారతీయులు రంగనాథ్ బాబు, ఇందిర దంపతులు**




**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ప్రముఖ శైవ బౌద్ధ క్షేత్రంగా విరాజుల్లుతున్న ఘంటసాల గ్రామంలో గొర్రెపాటి విద్యా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఐ లవ్ ఘంటసాల బోర్డును ఎన్నారై గొర్రెపాటి రంగనాథ బాబు - ఇందిరా దంపతులు గురువారం ప్రారంభించారు. చారిత్రక గ్రామమైన ఘంటసాల శైవ బౌద్ధ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలని, గ్రామాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని రంగనాథ బాబు దంపతులు తెలియజేశారు. ఘంటసాల గ్రామ చిహ్నాలు అయిన గాయక ఘంటసాల వెంకటేశ్వరరావు, గౌతమ బుద్ధుడు, శ్రీ జలదీశ్వర స్వామి భారీ విగ్రహాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఐ లవ్ ఘంటసాల బోర్డు వద్ద ప్రతి ఒక్కరు ఫోటోలు దిగి సోషల్ మీడియాలో పోస్టులు చేయాలని ఎన్నారై వేమూరి రాజేష్ కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, కొండపల్లి రామకృష్ణ, ఎస్.సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బాలే మస్తాన్ షా వలి ఉర్సు గంధం మహోత్సవం



**నందిగామ జనవరి 16, మేజర్ న్యూస్ :** హజరత్ సయ్యద్ షా బాలే మస్తాన్ షా వలి (చందాపురం దర్గా) 40 వ ఉర్సు మహోత్సవాలు గురువారం అత్యంత ఘనంగా పరారంభమయ్యాయి. దర్గా ముజావర్ సయ్యద్ సర్దార్ ఇంటి వద్ద నుండి హజరత్ వారి గంధం అత్యంత భక్తిశ్రద్ధలతో అలంకరించిన అశ్వం (గుఱ్ఱం)పై సాంప్రదాయపు సన్నాయి మేళతాళాలతో పట్టణ వీధులలో గుండా ఊరేగుతూ దర్గా షరీఫ్ కు చేరుకుంది. హజ్రత్ వారి దర్గా షరీఫ్ వద్ద అధ్యక్షులు షేక్ మస్తాన్ (పితాన్ మేస్త్రి) ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్న సమారాధన కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ గంధం మహోత్సవంలో కులమతాలు అతీతంగా భక్తులు పాల్గొని హజ్రత్ వారి ఆశీస్సులు పొందారు. నేడు హజ్రత్ వారి చిరాక అనగా దీపారాధన మహోత్సవం ఉంటుందని అధ్యక్షులు పితాన్ మేస్త్రి తెలిపారు.

# ఎన్నో చారిత్రాత్మక పుణ్యక్షేత్రాలున్న రాయలసీమను దర్శించండి







**ఎస్.ఎస్.ఆర్. సోదరి అంజనీ దేవి**

**అమరావతి మేజర్ న్యూస్ :** ఎన్నో చారిత్రాత్మక పుణ్య క్షేత్రాలు కడప జిల్లాలోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ప్రాంతంలో విరాజిల్లుతున్నాయని ఇటువంటి క్షేత్రాలలో కన్య తీర్థం లోని స్వయంభూ శ్రీ త్రిపుర సుందరీ దేవి, శ్రీ సుందరేశ్వర స్వామి ఒకేచోట కొలువుతీరడం విశేషమని ఆధ్యాత్మిక సేవకులు ఎస్ ఎస్ ఆర్. ఆంజనేయులు సోదరి,ఆరిమండ్ల అంజనీదేవి తెలిపారు. వారి కుటుంబ సభ్యులు శ్రీ త్రిపుర సుందరి దేవిని, శ్రీ సుందరేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలతో పాటు, వారణాశి, ప్రయాగ, తిరుపతి, భద్రాచలం తదితర ప్రాంతాలలో సీనియర్ పాత్రికేయులు ఆధ్యాత్మిక సేవకులు ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు "బయోగ్రఫీ" పేపర్లు ఈ పుణ్య క్షేత్రంలో భక్తులకు పంపిణీ చేశారు. ఈ ఆలయ ప్రధాన అర్చకులు భార్య గిరిజ ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంజనీదేవి మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణానికి 20 కి. మీ. జమ్మలమడుగు పట్టణానికి 15 కి.మి. దూరంలో కన్యతీర్థం పుణ్యక్షేత్రం వుందని, ప్రొద్దుటూరు పట్టణంలో శ్రీ రామేశ్వరం పుణ్యక్షేత్రం ఉందని తెలిపారు.

ఆంజనేయుడు స్వయంగా కాశీ నుండి తీసుకుని వచ్చిన శివలింగం వుందని దీనిని కాశీ అన్నపూర్ణ హనుమంతు లింగేశ్వర స్వామి క్షేత్రం అని పిలుస్తారని ఈ శివలింగాన్ని స్వయంగా శ్రీరామచంద్రుడు ప్రతిష్టించడం జరిందని చెప్పారు. అదేవిధంగా మైసూర్ తర్వాత రెండవ స్థానంలో శ్రీ కన్యకాపరమేశ్వరి బంగారు విగ్రహం ఉందని పేర్కొన్నారు. తన సోదరుడు ఎస్.ఎస్.ఆర్.ఆంజనేయులు రాష్ట్రంలోని చారిత్రాత్మకమైన పలు దేవాలయాలు దర్శించారని వెల్లడించారు. ఇటువంటి పుణ్యక్షేత్రాలు దర్శించాలని ఆమె భక్తులకు విజ్ఞప్తి చేశారు.

# మోహన్ భగవత్ పై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలను దేశం అంగీకరించదు

**బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ**



**విజయవాడ, మేజర్ న్యూస్ :** దేశ అభివృద్ధికి, సాంస్కృతిక పురోగతికి పాటు పడే సంస్థ ఆర్ఎస్ఎస్, అటువంటి సంస్థ సరసంఘ్ చాలాక్ మోహన్ భగవత్ పై రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని, అటువంటి నీచమైన వ్యాఖ్యలు ఎట్టి పరిస్థితుల్లో ఈ దేశం అంగీకరించదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మోహన్ భగవత్ రామాలయ నిర్మాణం అనంతరం జరుగుతున్న భారత దేశ సాంస్కృతిక పునరుజ్జీవనం గురించి మాత్రమే వ్యాఖ్యానించారని, స్వాతంత్ర్య సమరాన్ని ఎక్కడా అవమానించలేదు పైగా ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు దేశం కోసం పోరాడారు, ఆఖరి శ్వాస వరకు పోరాడుతూనే ఉంటారన్నారు. శ్రీ రాముడి అస్తిత్వం గురించి ఎటువంటి ఆధారాలు లేవని సుప్రీంకోర్టుకు తెలిపి, అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని అంగీకరించలేక, ప్రాణ ప్రతిష్ఠను తిరస్కరించి దేశ సంస్కృతిని అవమానించిన కాంగ్రెస్ పార్టీని దేశ ప్రజలు తిరస్కరిస్తున్నారన్నారు. భారతదేశాన్ని మతం ఆధారంగా ముక్కలు చేసింది కాంగ్రెస్, ఇప్పుడు కుల గణన పేరుతో దేశాన్ని మరోసారి విభజించే కుట్ర రాహుల్ గాంధీ చేస్తున్నాడు, హిందులను విభజించే ఇంతటి నీచ రాజకీయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారు, కాంగ్రెస్ కార్యాలయాలకు పరిమితమయ్యేలా చేస్తారు. అయినా స్వాతంత్ర్యం, స్వాతంత్ర్య సమరయోధులను గురించి మాట్లాడే హక్కు, అర్హత రెండు రాహుల్ గాంధీకి లేవు, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, బాబా సాహెబ్ అంబేద్కర్ వంటి మహోన్నతమైన వ్యక్తులకు గౌరవాన్ని కల్పించలేదు సరికదా వారిని అవమానించి, వారి మరణానంతరం వారి కుటుంబాలను కూడా వెంటాడి, వేధించింది కాంగ్రెస్ పార్టీ, నేడు బాబా సాహెబ్ అంబెడ్కర్ గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ఆయనను రెండు సార్లు ఎన్నికల్లో ఓడించేందుకు సర్వశక్తులను ఒడ్డింది. దేశ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన పి.వి.నరసింహ రావు పార్థివ దేహాన్ని కాంగ్రెస్ కార్యాలయంలోకి కూడా అనుమతించకుండా అవమానించింది సోనియా గాంధీ, 20 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఆయన చిత్రపటం కాంగ్రెస్ పార్టీలో లేదు, ఎందుకని? మీ దేశ వ్యతిరేక విధానాలను వ్యతిరేకించినందుకా? జాతిపిత గాంధీని అవమానించేలా కాంగ్రెస్ పార్టీ నూతన జాతీయ కార్యాలయాన్ని "గాంధీ భవన్" కాకుండా "ఇందిరా భవన్" అని పిలవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటి? దేశ ప్రజల హక్కులను చిదిమేసేందుకు ఆవిడ విధించిన ఎమర్జెన్సీని మరోసారి అమలు చేయాలనుకుంటున్నారా? మీ కుటుంబానికి కొన్ని దశాబ్దాల పాటు అధికారాన్ని ఇచ్చిన భారత దేశంపై, దేశం కోసం కార్యనిర్వహణ చేస్తున్న వ్యవస్థలపై పోరాటం చేస్తామంటూ రాహుల్ గాంధీ చేసిన దేశ వ్యతిరేక వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని బహిర్గతం చేసాయి, దేశ ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారు....సరైన సమయంలో భారతీయులే ప్రజాస్వామ్యబద్ధంగా సమాధానం ఇచ్చే రోజు దగ్గరలోనే ఉంది.

# వృద్ధులకు అన్నదానంచేసి, దుస్తుల వితరణ





**గుడివాడ మేజర్ న్యూస్:** యాదవ సంఘం నాయకులు తాతా చంద్రశేఖర్ యాదవ్ తన పుట్టినరోజు సందర్భంగా శాంతి వృధాశ్రమంలోని వృద్ధులకు చీరలు, దుస్తులు అందజేసి, అన్నదానం చేసారు. ఈ సందర్భంగా హరి కుమార్ మాట్లాడుతూ గత 5 సంవత్సరాలుగా తాతా సాయి మురళి కృష్ణ యాదవ్ శ్రీ కృష్ణ యాదవ సేవా సంఘం తరుపున అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ, తన సొంత గ్రామం కలవలపల్లిలోనూ పలు సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననల్ని పొందుతున్నాడన్నారు. సమాజ హితంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షను వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం నాయకులు జాజుల మునీంద్ర, యాదవ సంఘం నాయకులు మాకుల సత్యం, జాజుల తాతారావు, కంటిటి హరిబాబు, వరదాది మాన్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ గురు స్వామి తుర్లపాటి 41 వ శబరిమల యాత్ర



## ఘనంగా సాగనంపిన శిష్య బృందం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివిసీమలో తొలి తరం అయ్యప్ప మాల ధరించిన గురువు స్వామి తుర్లపాటి రామ్మోహన్ రావు గురుస్వామి 41వ సారి అయ్యప్ప మాల ధరించి గురువారం ఇరుముడి కట్టుకుని శబరిమల యాత్రకు బయలుదేరగా శిష్య బృందం గ్రామస్తులు తుర్లపాటి గురు స్వామిని ఘనంగా సాగనంపారు.స్థానిక శ్రీ లక్ష్మీనారాయణ స్వామివారి ఆలయ ఆవరణలో ఉదయం ఇరుముడి కట్టుకొని 41వ యాత్రకు తన శిష్య బృందంతో బయలుదేరి వెళ్లారు. మాల ధరించిన వారు మండల కాలం దీక్ష పూర్తి చేయడానికి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటారు అటువంటిది తుర్లపాటి రామ్మోహన్ రావు గురుస్వామి ప్రతి సంవత్సరం 115 రోజులపాటు ఉదయం, సాయంత్రం ఎముకల కొరికే చలిని, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కృష్ణా నదిలో పుణ్య స్థానం ఆచరించి గణపతి, కుమారస్వామి, అయ్యప్ప స్వామి వార్లకు తమ శక్తీ కొలది పూజలు నిర్వహిస్తారు. అయ్యప్ప మాల ధరించిన వారి ఇంట ప్రతి సంవత్సరం మధ్యాహ్నం, రాత్రి సమయాలలో 158 పూజలు 18 హోమ గుండాలు నిర్వహించిన ఘనత తుర్లపాటి కే దక్కింది. హోమ గుండాలు నిర్వహించడంలో రాష్ట్రవ్యాప్తంగా తుర్లపాటికి పెట్టింది పేరు. దివిసీమ ఆది గురువైన తుర్లపాటి రామ్మోహన్రావు చేతుల మీదుగా ఇప్పటికీ లక్షలాదిమంది మాల ధరించి ఇరుముళ్ళు కట్టుకొని శబరి యాత్ర చేసిన వారు ఉండగా, తన శిష్య బృందంలో మరి కొంతమంది వచ్చే సంవత్సరం 36వ సంవత్సర శబరి యాత్ర చేసేటందుకు సిద్ధంగా ఉన్నారు.ఇప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా 10 వేలకు పైగా హోమ గుండాల లో మాల ధరించిన భక్తులను నడిపించిన ఘనత తుర్లపాటికి దక్కింది. తుర్లపాటి అయ్యప్ప పూజ నిర్వహించడంలో తెలుగు రాష్ట్రాలలో అన్ని జిల్లాలలో ఎన్నో పూజలు నిర్వహించి మంత్రులు, ప్రజా ప్రతినిధులు చేతులు మీదుగా సన్మానాలు సైతం అందుకున్న కీర్తి తుర్లపాటికి దక్కింది అయితే దివిసీమలో మాల ధారణ అంటే ముందుగా గుర్తుకు వచ్చేది తుర్లపాటి పేరు మాత్రమే అటువంటి తుర్లపాటి 41వ యాత్ర శబరిమలై వెడుతున్న సందర్భంగా గ్రామస్తులు అతని శిష్య బృందం భారీగా తరలివచ్చి సాగనంపారు

# సేవా జీవితానికి నాంది పలికిన దివిసీమను ఎన్నటికి మరచిపోలేను

## హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** తన సేవా జీవితానికి నాంది పలికిన దివిసీమను ఎన్నటికీ మర్చిపోలేనని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం చండీఘర్ రాజ్ భవన్లో అవనిగడ్డ నియోజకవర్గ శాసన సభ్యులు మండలి బుద్ధప్రసాద్ తమ కుటుంబ సమేతంగా దత్తాత్రేయను కలిశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ దివిసీమ ఉప్పెన సమయంలో పని చేసిన వారందరిని గుర్తు చేసుకుని పేరుపేరున వారి గురించి అడిగారు.నాటి ఉప్పెనలో మండలి వెంకట కృష్ణారావు చేసిన సేవ చారిత్రాత్మకమని దత్తాత్రేయ అన్నారు. కాళ్లలో ముళ్లు గుచ్చుకుని పుండ్లు పడినా లెక్కచేయకుండా అవిశ్రాంతంగా పనిచేశారని గుర్తు చేసుకున్నారు. కృష్ణారావు – ప్రభావతి దంపతులు తన పట్ల చూపిన ప్రేమాభిమానాలు మరచిపోలేనన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా తెలుగు భాష అభివృద్ధికి కృష్ణారావు చేసిన కృషిని బుద్ధప్రసాద్ కొనసాగించడం ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. తన ఆత్మకథలో దివిసీమ ఉప్పెన స్మృతులను వ్రాస్తున్నట్లు దత్తాత్రేయ తెలిపారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తమ తండ్రి కృష్ణారావు మిమ్మల్ని సోదరునిగా భావించే వారని, మిమ్మలను మా కుటుంబ సభ్యునిగా మేమెప్పుడు భావిస్తామని అన్నారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ కుటుంబ సభ్యులను దత్తాత్రేయ ఆత్మీయంగా సత్కరించారు. ఆయనను బుద్ధప్రసాద్, వెంకట్రామ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బుద్ధప్రసాద్ సతీమణి మండలి విజయలక్ష్మి, కుమార్తె శీలం కృష్ణప్రభ, తనయుడు – కోడలు మండలి వెంకట్రామ్ – మండలి సాయి సుప్రియ దంపతులు పాల్గొన్నారు.

# గోశాలకు ఫ్యాను అందజేత



**నందిగామ, జనవరి 16, మేజర్ న్యూస్ :** ఎన్ఎస్ఆర్ చారిటబుల్ సొసైటీ స్థాపనకు స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ నందిరాజు శ్రీహరి రావు 78వ జయంతి పురస్కరించుకొని వారి కుమారులు ట్రస్ట్ అధ్యక్షులు ప్రకాష్ నందిరాజు ట్రెజరర్ నందిరాజు రాజ హనుమంతరావు లు వేదాద్రి గోశాల కు ఫ్యాను ను గోశాల నిర్వాహకులు చక్రపాణి కి అందజేశారు. కుటుంబ సభ్యులు శ్రీహరి రావు ని స్మరించుకుని వారికి స్మృత్యాంజలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మనుమలు నందిరాజు సాయిమణి, జబర్దస్త్ నేహాంత్, మనవరాలు మేఘన, గో సేవకులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్ ఆవిష్కరణ



**పామర్రు జనవరి 15 మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పామర్రు నియోజకవర్గ కార్యాలయంలో గురువారం పార్టీ క్యాలెండర్ ను మాజీ శాసనసభ్యులు, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ పమిడిముక్కల మండలం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీటీసీ సభ్యుడు గుర్విందపల్లి వంశీ, మర్రి బాబురావు, కాజిరెడ్డి, పద్మ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు

# వైసీపీ నాయకులు శవ రాజకీయాలు మానండి : టీడీపీ



**నందిగామ, జనవరి 16, మేజర్ న్యూస్:** చందర్లపాడు మండలం ముప్పాళ్ళ గ్రామం, వద్ద జరిగిన ఒక యాక్సిడెంట్ అడ్డుపెట్టుకొని దాన్ని హత్యగా చిత్రీకరించాలని తాపత్రయం లో వైసీపీ నాయకులు దేవినేని అవినాష్, మొండితోక జగన్ మోహన్ రావు ఉన్నట్టు స్పష్టంగా అర్థం అవుతుంది అని మండల అధ్యక్షులు మేకల సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. చందర్లపాడులో జరగని గొడవను జరిగినట్టుగా,, వేరే వారికి చందర్లపాడు లో గొడవ జరిగినట్లు అసత్యాలు మాట్లాడుతున్న వైసిపి నాయకులు వీరమణి తేజకు, వేరే వారికి చందర్లపాడులో గొడవ జరిగినట్లు నిరూపించగలరా, దయ్యాలు వేదాలు, వల్లించిన మాదిరిగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దౌర్జన్యాలు జరుగుతున్నాయని మాట్లాడుతున్న దేవినేని అవినాష్ వైసీపీ హాయంలో నీవు నీ గుండాలు టిడిపి కార్యాలయం పై దాడి చేసిన విషయాన్ని ప్రజలు ఇంకా మరువలేదు జరగని వాటిని జరిగినట్లు అబద్దాలను నిజాలని నమ్మించడానికి మీరు పడుతున్న తాపత్రయం, ఎంత పేలవంగా ఉందో ఈ ప్రాంత ప్రజలను అడిగి తెలుసుకోండి, “శవ” రాజకీయాలు మానకపోతే ఇప్పుడు వచ్చిన” 11 “లో ఒకటి కూడా మిగలదు,అన్న విషయాన్ని మర్చిపోవద్దని హితవు పలికారు.

# జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు సాయిబాబు ఎంపిక



**గన్నవరం, జనవరి 16, మేజర్ న్యూస్ :** ఒడిస్సా రాష్ట్రంలోని పూరి నగరంలో జరుగుతున్న సీనియర్ పురుషుల జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు గోగులమూడి సాయిబాబు ఎంపిక. గన్నవరంలో ఓ పత్రికా విలేకరిగా విధులు నిర్వహిస్తున్న గోగులమూడి సాయి బాబు స్వతహాగా చిన్నతనం నుండి క్రీడలపై మక్కువతో ఖోఖో క్రీడలో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీలలో కూడా పాల్గొన్నారు. ఇటీవల కర్నూలు జిల్లాలో జరిగిన ఏడవ రాష్ట్రస్థాయి పురుషుల షూటింగ్ బాల్ పోటీలలో కృష్ణాజిల్లా జట్టుకి ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు అట్లూరి రాజశేఖర్ తెలిపారు. ఈ పోటీలు ఒరిస్సా రాష్ట్రంలో జనవరి 17, 18, 19 మూడు రోజులు పాటు ఎంతో ఘనంగా జరగనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సాయిబాబాను కృష్ణాజిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ సభ్యులు, జిల్లాలోని ప్రముఖ క్రీడాకారులు క్రీడా సంఘ నాయకులు ఎంతగానో అభినందించారు.

# విక్కుర్తిని కలిసిన సాఫ్ట్వేర్ ఉద్యోగులు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ ను దివిసీమకు చెందిన పలువురు సాఫ్ట్వేర్ ఉద్యోగులు బుధవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. వృత్తి ఉద్యోగుల రీత్యా హైదరాబాదు తదితర ప్రాంతాల్లో ఉన్న వారు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సొంత గ్రామాలకు తరలి వచ్చారు. ఈ సందర్భంగా విక్కుర్తి గృహానికి వచ్చి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మిఠాయిలు తినిపించి ఘనంగా సత్కరించారు.

# డ్రైనేజీలు పరిశీలించిన డీసీ వైస్ చైర్మన్ రఘునాథ్, ఏఈ




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** రైతులకు మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ అందించేందుకు ఎమ్మె ల్యే మండలి బుద్ధ ప్రసాద్ ప్రణాళికాయు తంగా కృషి చేస్తున్నా రని కోడూరు డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్ తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్ దృష్ట్యా మోదు మూడి పరిధిలో చేపట్టవలసిన పనులను గుర్తించేందుకు డ్రెయినేజీలను పరిశీలించారు. సాగునీటి సంఘ పరిధిలోని పొలిమేర కోడు డ్రైన్, మాచవరం డ్రెయినేజీల పూడికతీత పనులు చేపట్టాలని గుర్తించారు. ఈ డ్రైన్లపై ఆవశ్యకత ఉన్న ప్రదేశాలలో కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని గుర్తించారు. డ్రైనేజీ ఏఈఈ అబ్దుల్ కరీమ్, బచ్చు మల్లి, తోట చక్రధర్, బచ్చు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో2004–06 లో ఇంటర్ హెచ్ఈసి చదివిన విద్యార్థినీ, విద్యార్థులు గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వృత్తి,ఉద్యోగాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్వగ్రామాలకు తిరిగి రావడంతో ఆనాడు విద్య నేర్పిన గురువులతో కలసి ఆ పాత మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.ఉపాధ్యాయులు హరికృష్ణ, షణ్ముఖరావు, రాజ్ కుమార్, రాజేందర్ లతో కలిసి విద్యార్థులందరూ సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించుకున్నారు.

# అన్ని వ్యవస్థలు గాడిన పడుతున్నాయి.. వృద్ధి రేటు మొదలైంది





**15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రణాళికల అమలు**

**గత పాలకుల నిర్వాకంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది**

**ఈనెల 18న వాట్సప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుడతాం**

**ఏపీ వృద్ధి రేటుపై సీఎం చంద్రబాబు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్**

**అమరావతి, జనవరి 16, మేజర్ న్యూస్ :** ఆంధ్ర రాష్ట్ర ప్రజలు నన్ను నమ్మారు. నేను వస్తే అభివృద్ధి జరుగుతుంది. సంపద వస్తుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించి ఆదాయం పెరుగుతుంది. పిల్లల భవిష్యత్ బాగుంటుందని ఓట్లు వేసి గెలిపించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా ప్రణాళికలు అమలు చేస్తున్నామని, 2047 నాటికి 42 వేల డాలర్ల తలసరి ఆదాయం లక్ష్యంగా నిర్ధేశించుకున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీ వృద్ధి రేటుపై గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

**విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు**

గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. వ్యవస్థలు భ్రష్టుపట్టాయి. మూడు రాజధానుల పేరుతో అమరావతిని సమాధి చేశారు. ఏపీ జీవనాడి పోలవరాన్ని గోదావరిలో కలిపేశారు. గత పాలనలో ఎవ్వరికీ స్వేచ్ఛ లేదు. ఇక్కడ పుట్టి పెరిగిన వారు కూడా రాష్ట్రానికి రావాలన్నా, పెట్టుబడులు పెట్టాలన్నా భయపడే పరిస్థితి తీసుకొచ్చారు. విపత్కర పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు తీసుకెళ్లే బాధ్యత ప్రజలు మాకు అప్పగించారని ముఖ్యమంత్రి అన్నారు.

**సంపద సృష్టిస్తేనే ఆదాయం పెరుగుతుంది**

అభివృద్ధి వల్ల సంపద వస్తుంది. సంపద వల్ల ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. ప్రభుత్వ ఆదాయం పెరిగితే దాన్ని సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించి పేదరికం రూపుమాపవచ్చు. ఇది నేను నమ్మిన ఆర్థిక సిద్ధాంతం. 1995లో నేను ఐటీ అంటే అందరూ నవ్వారు. ఐటీ తీసుకొస్తే తిండిపెడుతుందా అని చాలామంది ఎగతాళి చేశారు. నేడు ఐటీ మనిషిని ఎక్కడికో తీసుకెళుతోంది. 1991లో వచ్చిన ఆర్థిక సంస్కరణలు, 1992లో వచ్చిన ఇంటర్నెట్ విప్లవాన్ని నేను మనసావాచా నమ్మి ఆచరణలో పెట్టాను. నేను తెచ్చిన విజన్ 2020తో నేడు దేశంలోనే తలసరి ఆదాయంలో తెలంగాణ ముందుంది. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు ఎక్కువ తలసరి ఆదాయం సంపాదిస్తున్నారు. రెండోతరం ఆర్థిక సంస్కరణలకు నేను నాంది పలికాను. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చి రాష్ట్రానికి వెలుగులు ఇచ్చి నేను ఓడిపోయాను. ఆ విషయంలో నేను రాజీపడి ఉంటే ఓడిపోయేవాడిని కాదేమో. విమానాశ్రయాలకు ఓపెన్ స్కై పాలసీ తీసుకొచ్చాను. శంషాబాద్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులకు శ్రీకారం చుట్టాను. శంషాబాద్ ఎయిర్ పోర్టును 5 వేల ఎకరాలతో ప్రారంభించామని ముఖ్యమంత్రి చెప్పారు. నాడు విశాలమైన రహదారులకు శ్రీకారం చుట్టాను. నేడు 14 లైన్ల వరకూ రోడ్లు వేస్తున్నారు. నాడు హైదారాబాద్ లో 163 కిలోమీటర్ల రింగ్ రోడ్డుకు శ్రీకారం చుట్టాము. ఇవన్నీ చేయడం వల్ల ఆదాయం పెరిగింది.

**15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం**

స్వర్ణాంధ్ర - 2047 విజన్ లక్ష్యంగా పనిచేస్తున్నాము. 15 శాతం వృద్ధి రేటు సాధించడం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాము. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తయారుకావాలని లక్ష్యాన్ని నిర్ధేశించున్నాము. గత సంవత్సరం కంటే ఈ ఏడాది 4.03 శాతం వృద్ధి రేటు పెరిగింది. తెలుగుదేశం హయాంలో తలసరి ఆదాయం వృద్ధి 13.21 శాతం ఉండగా గత ప్రభుత్వంలో అది 9.06 శాతమే ఉంది. దీనివల్ల ప్రజల జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయి. ఆదాయం పెరిగితేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అందుకే విజన్ రూపొందించి దానికి అనుగుణంగా పనిచేస్తున్నాము. టీడీపీ వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. టీడీపీ అధికారంలో ఉంటే రైతులకు పండుగే. ఏడు నెలల్లోనే రూ. 1500 కోట్ల బకాయిలు చెల్లించాము.

**పీ-4 గేమ్ ఛేంజర్ :**

ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసిన సంస్కరణలు, తెచ్చిన పాలసీలతో కోట్లాది మంది జీవితాలు మారాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా నాడు తీసుకువచ్చిన పీ3 (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్) విధానంతో ఉపాధి, సంపద సృష్టి జరిగింది. ఇప్పుడు స్వర్ణాంధ్ర -2047 విజన్ ను ఆవిష్కరించాం. ఇందులో పేర్కొన్న పది సూత్రాల అమలు ద్వారా తెలుగు జాతిని ప్రపంచంలో నెంబర్ 1 చేసేందుకు అడుగులు వేస్తున్నాం. వీటిలో ప్రథమ సూత్రం జీరో పావర్టీ. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఉద్దేశించిందే పీ4 కాన్సెప్ట్ (పబ్లిక్ - ప్రైవేటు- పీపుల్-పార్టనర్షిప్) దక్షిణ భారతదేశంలో జనాభా పెరుగుదల రేటు క్షీణించడం ఆందోళన కలిగిస్తోంది. ఏపీ జనాభా వృద్ధి రేటు 1.5 శాతం. దక్షిణ కొరియాలో అయితే 5 శాతం వృద్ధి ఉంది. జపాన్, చైనా, యూరప్ వంటి దేశాల్లో జనాభా తగ్గింది. జర్మనీ వంటి దేశాలు ఇప్పుడు మన మానవ వనరులు కోసం ఎదురుచూస్తున్నాయి.

**వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ మా నినాదం**

ఒక వ్యక్తి ఆనందంగా ఉంటే ఆ కుటుంబం ముందుకుపోతుంది. కొన్ని కుటుంబాల్లో పిల్లలు తల్లిదండ్రులను చూసుకోలేని పరిస్థితి. నేను రూ. 4 వేలు పెన్షన్ ఇవ్వడంతో ఇప్పుడు తల్లిదండ్రులను పిల్లలు చూసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. వృద్ధులు, వితంతువులకు రూ. 4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలు, కిడ్నీ రోగులకు రూ. 10 వేలు ఇచ్చాం. మంచం మీద నుంచి లేవలేని స్థితిలో ఉన్నవారికి రూ. 15 వేలు ఇస్తున్నాము.

**ఈ నెల 18న వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం**

కుటుంబ వ్యవస్థ వల్ల భద్రత ఉంటుంది. నేడు ఆధార్ వల్ల ఎవరు ఏంటో వెంటనే తెలిసిపోతోంది. పూర్తి వివరాలు వచ్చేస్తున్నాయి. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పెట్టినా, పెన్షన్ ఇచ్చినా, రైతు భరోసా ఇచ్చినా విడివిడిగా ఇస్తున్నారు. నేను వీటన్నింటినీ కుటుంబానికి అనుసంధానం చేస్తున్నాను. ఆ ఇంటిని జియో ట్యాగింగ్ చేస్తున్నాను. ఏదైనా విపత్తు వస్తే నేరుగా సంబంధిత ఇంటి వివరాలు వచ్చేస్తాయి. ఈనెల 18న వాట్సాప్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుడుతున్నాము. సెల్ ఫోన్ ద్వారా ప్రజలకు అవినీతి రహితంగా 150 సేవలు అందిస్తాము. దీనివల్ల ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండదు.

**విజన్‌తో అద్భుత ఫలితాలు**

ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి రూ. నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అమరావతి పనులు జరుగుతున్నాయి. పోలవరం పనులు వేగవంతం చేశాం. అమెరికా సిలికాన్ వ్యాలీలో నీరు లేక రూ. 4 లక్షల కోట్ల ఆస్తి బూడిదయ్యింది. అందుకే నీటి భద్రత చాలా ముఖ్యం. పోలవరం పూర్తయ్యే నాటికి గోదావరి పెన్నా నదుల అనుసంధానం చేస్తాము. టెక్నాలజీ సాయంతో వ్యవసాయం లాభసాటిగా మార్చడంతో పాటు ఖర్చు తగ్గించే విధానాలపై దృష్టి పెట్టాను. ఏపీలో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి పెట్టాను. స్వచ్ఛాంధ్రప్రదేశ్ నినాదాన్ని ప్రజల్లోకి ఉధృతంగా తీసుకెళున్నాము. గత ఐదేళ్లు గుంతల రోడ్లుతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆరు నెలల్లోనే రోడ్లు వేశాం. సంక్రాంతికి ఇంటికి వెళ్లిన వారందరూ రోడ్లను చూసి సంతోషం వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.



## సైంటిస్ట్‌గా ఎంపికైన తెలుగు యువకుడు జగడం రమేష్‌కు సీఎం అభినందనలు

**అమరావతి, జనవరి 16, మేజర్ న్యూస్ :** ఇస్రో ఇటీవల నిర్వహించిన పరీక్షలో ఆలిండియా 9 ర్యాంకు సాధించి సైంటిస్ట్‌గా ఎంపికైన తెలుగు యువకుడు జడగం రమేష్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గురువారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రమేష్ తండ్రి శ్రీనివాసులు డ్రైవర్‌గా, తల్లి రామలక్ష్మి టైలర్‌గా పనిచేస్తూ కష్టపడి చదివించారని తెలుసుకున్న ముఖ్యమంత్రి వారిని అభినందించారు. చంద్రయాన్-3 ల్యాండర్ మిషన్ టీమ్‌లో ఒకరిగా పనిచేసిన రమేష్, భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

## క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డిని అభినందించిన మంత్రి నారా లోకేష్





**విజయవాడ, జనవరి 16, మేజర్ న్యూస్ :** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి రాజ్య సభ ఎంపి సానా సతీష్ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్-గావస్కర్ సిరీస్‌లో సత్తా చాటిన వైజాగ్ కి చెందిన నితీష్ కుమార్ రెడ్డి గురువారం ఉండవల్లిలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నివాసంలో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ క్రికెటర్ నితీష్ కుమార్ రెడ్డిను అభినందించి శాలువాతో సత్కరించి వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహుకరించారు. నితీష్ కుమార్ రెడ్డి తో మాట్లాడి తన క్రికెట్ విశేషాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో యువ క్రీడాకారులకు సహకారం అందించాలని సూచించారు. అలాగే ఏసీఏ అధ్యక్షుడు ఎంపి కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి రాజ్య సభ ఎంపి సానా సతీష్‌లతో క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా వుంటుందని తెలిపారు. నితీష్ కుమార్ రెడ్డి భవిష్యత్తులో మరిన్ని విజయాలతో పాటు సరికొత్త రికార్డ్స్ సాధించాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు పి.వెంకట రామ ప్రశాంత్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, ఏసీఏ కౌన్సిలర్ దంతు గౌరు విష్ణుతేజ్, కె.ముత్యాలరెడ్డి పాల్గొన్నారు.

# ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్



**దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలనే లక్ష్యం**

**నెల కొక థీమ్ తో 12 మాసాలకు 12 థీమ్లతో కార్యక్రమ నిర్వహణకు చర్యలు**

**18న కడప జిల్లా మైదుకూరులో కార్యక్రమాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి**

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్**

**క్యాంపైన్ మోడ్ లో నిర్వహించాలని సూచించిన పురపాల శాఖ మంత్రి పి.నారాయణ**

**అమరావతి, జనవరి 16, మేజర్ న్యూస్ :** దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నెలలో ఒక శనివారం "స్వచ్ఛత" కోసం అంకితం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఇకపై ప్రతి మూడో శనివారం "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్" కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టడమైందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ఈ నెల 18 వ తేదీన కడప జిల్లా మైదుకూరులో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయి అధికారుల వరకూ ప్రతి ఒక్కరూ అంకిత భావంతో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తగిన సూచనలు, ఆదేశాలను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన మార్గదర్శకాలను ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లకు కమ్యునికేట్ చేయడం జరిగిందని, ఆ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు తగిన శ్రద్ధ చూపాలన్నారు. సత్ ఫలితాలను ఆశిస్తూ ఈ నెల నుండి వచ్చే 12 నెలల పాటు నెల కొక థీమ్ తో 12 మాసాలకు 12 థీమ్ లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జనవరి మాసంలో న్యూ ఇయర్ - క్లీన్ స్టార్ట్ థీమ్ తోను, ఫిబ్రవరి మాసంలో సోర్సు-రిసోర్సు థీమ్ తోను, మార్చిలో అవాయిడ్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ - ప్రమోట్ రీయూజబుల్స్ థీమ్ తోను, ఏప్రిల్ లో ఇ-వెక్ థీమ్ తోను, మే లో నీరు-మీరు థీమ్ తోను, జూన్ లో బీట్ ది హీట్ థీమ్ తోను, జులై లో ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ థీమ్ తోను, ఆగస్టు లో మాన్ సూన్ హైజెనిక్ థీమ్ తోను, సెప్టెంబరు లో గ్రీన్ ఏ.పి. థీమ్ తోను, అక్టోబరులో క్లీన్ ఎయిర్ థీమ్ తోను, నవంబరులో పెర్సనల్ & కమ్యునిటీ హైజిన్ థీమ్తోను, డిశంబరు మాసంలో ఆపర్చునిటీస్ ఇన్ ఇన్విరాన్మెంట్ థీమ్తోను ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అంశంలో కమ్యూనిటీ ఎంగేజ్ మెంట్ ను ప్రోత్సహించడం, పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, పర్యాటకులు, యాత్రికులు, పెట్టుబడిదారులను మరింత ఆహ్వానించే విధంగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, ఆర్థిక ప్రయోజనాలను మెరుగుపర్చడం, పిల్లలు, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిదులను, అన్ని వర్గాల ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యులను చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమ నిర్వహణలో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కీలక భూమిక పోషించాల్సి ఉందని, అందుకు తగ్గట్టుగా ఆయా శాఖల అధికారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వర్చువల్గా పాల్గొన్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని క్యాంపైన్ మోడ్ లో నిర్వహించాలని, ఈ కార్యక్రమంపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని, రాష్ట్రంలోని ప్రతి నియోజక వర్గంలో పెద్ద ఎత్తున ప్రజల భాగస్వామ్యంతో మానవ హారాన్ని నిర్వహించాలని కోరారు. అందుకు తగ్గట్టుగా అన్ని జిల్లాల కలెక్టర్లకు తగు ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర పంచాయితీ రాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్, ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి.అనిల్అ కుమార్ రెడ్డి, రాష్ట్ర పురపాల & పట్టణాభివృది శాఖ కార్యదర్శి కన్నబాబు, పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి కృష్ణచైతన్య తదితరులు మాట్లాడుతూ ఈ కార్యక్రమ నిర్వహణకు జిల్లా కలెక్టర్లు, అధికారులు నిర్వహించాల్సిన విధి విదానాలను వివరించారు.

# పసుపు సైన్యం @కోటి

**1,00,52,598 సభ్యత్వాలతో చరిత్ర తిరగరాసిన తెలుగుదేశం పార్టీ**

**లక్ష సభ్యత్వాల మార్క్ దాటిన 11 నియోజకవర్గాలు**

**50 వేల సభ్యత్వాల మార్క్ దాటిన 105 నియోజకవర్గాలు**

**కార్యకర్తల సంక్షేమం కోసం విప్లవాత్మక అడుగులు వేస్తున్న సంక్షేమ నిధి సారధి నారా లోకేష్**

**ప్రమాద భీమాను రూ. 5 లక్షలకు పెంచుతూ యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్తో ఒప్పందం**

**అమరావతి, జనవరి 16, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సరికొత్త రికార్డు సృష్టించింది. గత ఏడాది అక్టోబర్ 26 న టిడిపి అధినేత చంద్రబాబు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అండమాన్ లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభ్యత్వాలు తీసుకున్న వారి సంఖ్య కోటి మార్క్ ను దాటి చరిత్రను తిరగరాసింది. 1,00,52,598 మంది టిడిపి సభ్యత్వం తీసుకున్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసారు. 11 నియోజకవర్గాలు లక్ష సభ్యత్వాల మార్కును దాటాయి. 105 నియోజకవర్గాలు 50 వేల సభ్యత్వాల మార్కును దాటాయి. కోటి మంది సభ్యులతో తెలుగుదేశం పార్టీ అతి పెద్ద కుటుంబంగా అవతరించింది. టెక్నాలజీ అనుసంధానంతో సభ్యత్వ నమోదు కార్యక్రమం సులభమైంది. ప్రజలు స్వయంగా సభ్యత్వ నమోదు చేసుకునే సౌలభ్యం కల్పిస్తూ వారు ఎక్కువగా వినియోగించే ప్లాట్ ఫామ్స్ తో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయం సభ్యత్వ నమోదు కార్యక్రమం ఇంత పెద్ద సక్సెస్ కావడానికి ప్రధాన కారణం. టెక్నాలజీ వినియోగం ద్వారా పార్టీ కోసం క్షేత్ర స్థాయిలో ఎవరు కష్టపడి పనిచేస్తున్నారో పార్టీ అధిష్ఠానానికి స్పష్టంగా తెలుస్తుంది. తద్వారా పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఇచ్చేప్పుడు ప్రాధాన్యత లభిస్తుంది. పనిచేసే వారికే ప్రాధాన్యత అని లోకేష్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు. పార్టీ సభ్యత్వ నమోదులో తాము చేసిన కష్టానికి గుర్తింపు లభిస్తుందని కార్యకర్తలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. నారా లోకేష్ ఎక్కువ సభ్యత్వాలు చేసిన కార్యకర్తలతో మాట్లాడి అభినందించడం, ప్రోత్సహించడం ఈ సక్సెస్ కు ప్రధాన కారణం.




**టాప్ టెన్**

సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పోటీపడి మరీ రికార్డులు సృష్టించారు. 11 నియోజకవర్గాలు లక్ష సభ్యత్వాల మార్కు దాటా యి. టాప్ టెన్లో నెల్లూరు సిటీ 1,49,270, ఆత్మకూరు 1,48,802, పాల కొల్లు 1,48,559, రాజంపేట 1,45,766,కుప్పం 1,38,446, ఉండి 1,21,527, గురజాల 1,11,458, వినుకొండ 1,06,867, మంగళగిరి 1,06,145, కళ్యాణదుర్గం 1,01,221, కొవూరు 1,00,473 నియోజకవర్గాలు ఉన్నాయి.

**లైఫ్ టైమ్ మెంబర్షిప్**

శాశ్వత సభ్యత్వాలకు కూడా పెద్ద ఎత్తున స్పందన లభించింది. మంగళగిరి - 145, ఆత్మకూరు - 137, వినుకొండ - 79, గంగాధర నెల్లూరు - 62, తణుకు - 60 నియోజకవర్గాలు టాప్ ఫైవ్ లో నిలిచాయి.

**కార్యకర్తల సంక్షేమం**

కార్యకర్తలను తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులుగా భావిస్తుంది. వారి సంక్షేమానికి భారతదేశంలోనే ఏ రాజకీయ పార్టీకి లేని కార్యకర్తల సంక్షేమ విభాగాన్ని ఏర్పాటు చేసి..టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో దిగ్విజయంగా నడిపిస్తున్నారు. కార్యకర్తలు.. వారి కుటుంబ సభ్యుల విద్య, వైద్యం, వివాహం, ఆర్థిక అవసరాలలో ఆదుకుంటూ కొండంత అండగా నిలుస్తున్నారు. ప్రమాదంలో కార్యకర్తలు చనిపోతే వారి కుటుంబానికి ప్రమాదభీమా అందించి ధీమా కల్పిస్తున్నారు. టిడిపి కార్యకర్తల బాగోగులు చూసుకునే బాధ్యత లోకేష్ కు అప్పగిస్తున్నామని 2014 మహానాడులో టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించారు. నాటి నుంచి నేటివరకూ కార్యకర్తల పెన్నిధిగా వ్యవహరిస్తున్న లోకేష్ సంక్షేమనిధితో ఆదుకుంటున్నారు. ఇప్పటివరకు 2500 మందికి పైగా కార్యకర్తల పిల్లల చదువులకు సహాయం చేశారు. వివిధ ప్రమాదాల్లో మరణించిన సుమారు 5164 మంది కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల రూపాయలు చొప్పున రూ. 103 కోట్ల 28 లక్షల రూపాయలు అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న అనేక మంది కార్యకర్తలకు వైద్య సహాయం అందించారు. సుమారు 2000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారు. సుమారు 5000 మంది కార్యకర్తల కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలిచి రూ. 19 కోట్లు ఆర్థిక సహాయం చేశారు. రూ.100తో సభ్యత్వం తీసుకున్న తెలుగుదేశం కార్యకర్తల సంక్షేమం చూసేందుకు లోకేష్ ఆధ్వర్యంలో టిడిపి వెల్ఫేర్ వింగ్ అవిశ్రాంతంగా పని చేస్తోంది. ఎన్టీఆర్ మోడల్ స్కూళ్ల ద్వారా ఉచిత విద్య, ఉపకారవేతనాలు, ప్రైవేట్ స్కూళ్లలోనూ ఫీజుల్లో రాయితీలుగా రూ. 2 కోట్ల 35 లక్షల రూపాయలు చెల్లించారు. చదువు పూర్తయిన వారికి ఉపాధి.. ఉద్యోగావకాశాలు సాధించేలా నైపుణ్యశిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం అదే రూ.100తో తీసుకున్న సభ్యత్వం ద్వారా వచ్చే ప్రమాద బీమా ప్రయోజనాన్ని రూ. 5 లక్షలకు పెంచారు. నారా లోకేష్ సమక్షంలో కోటి మందికి ప్రమాద భీమా కల్పిస్తూ తెలుగుదేశం పార్టీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ మధ్య ఒప్పందం చేసుకున్నారు.

# ప్రజా హృదయాల్లో నేటి దినపత్రిక సూర్యకు సుస్థిర స్థానం

**నేటి దినపత్రిక సూర్య క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించిన మంత్రి కొల్లు రవీంద్ర**





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సమకాలిన సమస్యలను, ఎప్పటికప్పుడు తాజా వార్తలను నిరంతరం అందించే 'నేటి దినపత్రిక సూర్య' ప్రజా హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకుందని, రాష్ట్ర గనులు, మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం మంత్రి నివాసంలో 'నేటి దినపత్రిక సూర్య' క్యాలెండర్లు, డైరీలు, రవీంద్ర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 వసంతాలు పూర్తిచేసుకుని, ప్రజా బాహుళ్యంలో విశిష్ట జనాదరణ పొందిన 'నేటి దినపత్రిక సూర్య' యాజమాన్యాన్ని సిబ్బందిని అభినందించారు. క్యాలెండర్లు, డైరీలు మంచి నాణ్యతతో వేయించినందుకు మంత్రి రవీంద్ర 'నేటి దినపత్రిక సూర్య' యాజమాన్యాన్ని, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, 'నేటి దినపత్రిక సూర్య' కృష్ణా జిల్లా బ్యూరో కూరేటి సతీష్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఇళ్ల రిజిస్ట్రేషన్ కోసం కార్పొరేషన్లో రెండు సబ్ రిజిస్టర్ ఆఫీస్లు

**కార్పొరేషన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి**

**జనవరి 28 ఆఖరి తేదీ**



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** పాయకాపురం కాలనీస్, కొత్త రాజరాజేశ్వరి పేటలో ఇంకాను వెయ్య బి–ఫామ్ పట్టాల రిజిస్ట్రేషన్ జరగాల్సి ఉన్నవి కాబట్టి వాటి ప్రక్రియను విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్ లో రెండు సబ్ రిజిస్టర్ ఆఫీస్ లను ఏర్పాటు చేశారని ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కమిషనర్ మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా యజమానులుగా ఉంటున్న వారికి గజం 100



రూపాయలకు రిజిస్ట్రేషన్ చేయుటకు జనవరి 28వ తేదీ చివరి తేదీని, ఆసక్తి గల ప్లాట్ ఓనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్లో రెండు సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో ఏర్పాటు చేసి జనవరి 16 నుండి 28 వరుకు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు వచ్చి ఇక్కడ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోగలరని అన్నారు. ఎవరైతే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అనుకుంటున్నారో, వారు వారితోపాటు ఇంటి పట్టా, లింక్ డాక్యుమెంట్స్, యజమాని ఆధార్ కార్డ్, ఇంటి పన్ను రసీదు, ఇద్దరు సాక్షులు వారి ఆధార్ కార్డులతో ఇంటి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోగలరని తెలిపారు.

# జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ప్రారంభం



**రోడ్డు భద్రత నియమాలను పాటించండి**

**ప్రమాద రహిత ప్రయాణం చేయండి**

**ప్రాంతీయ రవాణా శాఖాధికారి యం.పద్మావతి**

**నందిగామ, జనవరి 16, మేజర్ న్యూస్:**రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ప్రతి ఒక్కరు ప్రమాద రహిత ప్రయాణం చేయాలని ప్రాంతీయ రవాణా శాఖాధికారి యం.పద్మావతి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం వద్ద రోడ్డు భద్రత మాసోత్సవాలను వివిధ శాఖల అధికారులతో కలసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ రవాణా శాఖాధికారి యం.పద్మావతి,మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎంవి నారాయణరాజు, సహాయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కె జయ చంద్ర, ఆర్ అండ్ బి ఏ ఈ కిశోర్, ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ నరేష్, ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ బాబు రావు, నేషనల్ హైవే మేనేజర్ శ్రీనివాస రావు, పరిపాలన అధికారి బి ఎస్ కే ప్రభాకర లింగం సీనియర్ అసిస్టెంట్ పి. శ్రీలక్ష్మి, అన్నపూర్ణ డ్రైవింగ్ స్కూల్ విద్యార్థులు, బోస్ డ్రైవింగ్ స్కూల్ విద్యా ర్థులు, కార్యాలయ సిబ్బందిలతో కలిసి కరపత్రాలను ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రతిరోజు రోడ్డు భద్రత మాసోత్సవములో భాగంగా పోలీస్, వైద్య, ఆర్ అండ్ బి, వాహన డీలర్లు, విద్యాశాఖ, నేషనల్ హైవే అథారిటీ తదితర శాఖల సమన్వయంతో సమావేశాలు ర్యాలీలు సమీక్షలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాంతీయ రవాణా శాఖాధికారి యం. పద్మావతి మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రయాణం చేస్తే ఎలాంటి ప్రమాదాలకు తావుండదని ప్రతి ఒక్కరు రోడ్డు నియమ నిబంధనలను పాటించి తమ ప్రయాణాలను శుభప్రదం చేసుకోవాలని అన్నారు.





## బీజేపీ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ దివస్

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి**

**విజయవాడ, మేజర్ న్యూస్ :** సమ్విధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమ బృందం ప్రతినిధులతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి సమావేశమయ్యారు. సంవిధాన్ గౌరవ దివస్ కార్యాచరణకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, అండమాన్ నికోబార్ రాష్ట్రాల ఇంచార్జ్ ఎన్ మహేష్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. సంవిధాన్ కార్యక్రమం క్షేత్ర స్థాయిలోకి తీసుకుని వెళ్ళేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి ఆధ్వర్యంలో కార్యక్రమం రూప కల్పన చేశారు. పలు ప్రాంతాల్లో దళిత యువకులతో సహపంక్తి భోజనాలు, పోలింగ్ బూత్ స్థాయి లో సంవిధాన్ కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ కార్యక్రమం ఏర్పాటు ఎలా ఉండాలి అనే విషయాలను వివరించారు. సమావేశంలో సంవిధాన్ కార్యక్రమం రాష్ట్ర ఇంఛార్జిలు గుడిసె దేవానంద్,శరణాల మాలతీ రాణి తదితరులు పాల్గొన్నారు.

## హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ రూ.5000 సహాయం



**గూడూరు మేజర్ న్యూస్:** మల్లవోలు గ్రామానికి చెందిన అడ్డాల ఆంజనేయులు అనే వ్యక్తి బుధవారం చనిపోయాడు ఆయన అంత్య క్రియలు నిమిత్తం మల్లవోలుకు చెందిన హెల్పింగ్ హాండ్స్ అనే స్వచ్ఛంద సంస్థ 5000 రూపాయలు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ యూత్ ప్రెసిడెంట్ పడవల మోహన్ త్రినాథ్,ముదినేని వెంకటేశ్వరరావు నెహ్రూ మాస్టర్ ధర్మ తేజ తదితర హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు

## మహాసేన రాజేష్ వాక్యాలను ఖండించిన గల్లా తిమోతి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మహా సేన రాజేష్ పరిమితులు దాటి మాట్లా డటం సరి కాదని, అధికార ప్రతినిధి హోదాలో ఉన్నప్పుడు కూటమి ప్రభుత్వ మీద ప్రభావం చూపేలా మాట్లాడటాన్ని పెదయాదర సర్పంచ్, మచిలీపట్నం జనసేన మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర సర్పంచుల సంఘం అధికార ప్రతినిధి గళ్ళా తిమోతి ఖండించారు. సొంత నిర్ణయాలు, సలహాలు, కూటమి ప్రభుత్వం ఉన్నప్పుడు మీడియా ముఖంగా చెప్పడం సబబు కాదన్నారు. మహాసేన రాజేష్ విశ్లేష తామెప్పుడు స్వాగతిస్తామని కానీ సిఎం చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పైన కామెంట్ చేసేటప్పుడు అలోచించి మాట్లాడాలని ఒక మంచి భావనతో వారిరువురు రాష్ట్ర ప్రయోజనాన్ని ఆశిస్తూ వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ సాధించారని, ఈ సందర్భంగా గళ్ళా తిమోతి గుర్తుచేశారు. కొంతమంది క్షుద్రశెక్తుల భారినుండి మహాసేన రాజేష్ తనని తాను రక్షించుకోవాలని హితవు పలికారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999